సాక్షి
మెదక్
ఆదివారం । 23 । ఏప్రిల్ । 2023



నవాబుపేట ఈద్గాలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు

న్యూస్‌రీల్

సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి



ఎంఈఓను సన్మానిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

నర్సాపూర్: సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని గిరిజన గురుకులాల మెదక్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ సంపత్‌కుమార్ సూచించారు. నర్సాపూర్‌లోని అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకుల ఫైన్ ఆర్ట్స్ స్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపును ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులకు లైఫ్ స్కిల్స్, వెస్టర్న్ డ్యాన్స్, ఫన్ అండ్ సైన్స్ ఇన్నోవేషన్స్ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఎంఈఓ బుచ్యానాయక్ మాట్లాడుతూ.. గిరిజన గురుకులాల ద్వారా విద్యార్థులకు మంచి బోధన అందుతుందని తెలిపారు. బోధనతో పాటు ప్రత్యేక శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భిక్షమయ్య, సిబ్బంది చార్లెస్, సుదీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని లాభాల బాట పట్టించాలి



మాట్లాడుతున్న డీఎం రవిచందర్

మెదక్‌జోన్: ప్రయాణికులే సంస్థకు నిధి అని.. వారి పట్ల గౌరవంగా ఉంటూ ఆర్టీసీని లాభాల బాట పట్టించాలని ఆర్టీసీ డీఎం రవిచందర్ సూచించారు. శనివారం మెదక్, నర్సాపూర్ డిపోలకు చెందిన కండక్టర్లు, డ్రైవర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంస్థకు ఆదాయ వనరులు తెచ్చేది క్షేత్రస్థాయిలో డ్రైవర్లు, కండక్టర్లేనని చెప్పారు. ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా మాట్లాడటం అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ వీరబాబు, సిబ్బంది తిరుమలేష్, నారాయణ, కృష్ణ, రమేశ్, సంగమేశ్వర్ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న గౌడ సంఘం నాయకులు

నర్సాపూర్: కల్లు వ్యాపారిపై దాడి చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని శ్రీ నూతన గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలోని నాగులపల్లికి చెందిన కల్లు వ్యాపారి అశోక్‌గౌడ్‌తో పాటు అతడి కుటుంబ సభ్యులపై ఇటీవల అదే గ్రామానికి చెందిన రాంచందర్, నర్సింలు, రాములు దాడి చేశారని.. వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆశాగౌడ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో బెల్టు దుకాణాలను అదుపు చేయాలన్నారు. సమావేశంలో గౌడ సంఘం నాయకులు రాజాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వానం



ఎంపీ ప్రభాకర్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): ఈనెల 28న మెదక్‌లో జరిగే రెడ్డి ఆత్మీయ సమ్మేళనానికి హాజరు కావాలని శనివారం ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డిని రెడ్డి సంఘం నాయకులు ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా రెడ్డి సంఘం కో ఆర్డినేటర్ భాగారెడ్డి, రెడ్డి సంఘం జిల్లానాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రభురెడ్డి, మహేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

'భవన నిర్మాణానికి సహకరించండి'

తూప్రాన్: యాదవ భవన నిర్మాణానికి సహకరించాలని కోరుతూ మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్‌కు శనివారం అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు గండి మల్లేష్‌యాదవ్ ఆధ్వర్యంలో గొల్లకురుమలు వినతిపత్రం అందజేశారు. మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లి భవన నిర్మాణానికి తనవంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

గాలివాన బీభత్సం

మెదక్ మున్సిపాలిటీ: ఈదురుగాలులతో కూడిన భారీ వర్షంతో శనివారం సాయంత్రం మెదక్ పట్టణం అతలాకుతలమైంది. పట్టణంలోని ఫత్తేనగర్‌లో ఓ ఇంటిపై చెట్టు పడడంతో పైకప్పు కూలింది. ఆసమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అలాగే నవాబుపేట వీధిలోని దర్గా వద్ద చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో పట్టణంలో 3 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పలు చోట్ల ఇళ్లపై రేకులు ఎగిరిపడ్డాయి.





ఫత్తేనగర్ వీధిలో ఓ ఇంటిపై పడిన చెట్టు



నవాబుపేట వీధిలో విరిగిపడిన విద్యుత్ స్తంభం

భక్తి శ్రద్ధలతో రంజాన్

మెదక్ మున్సిపాలిటీ: ముస్లింల అతి పెద్ద పండగ రంజాన్‌ను శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని నవాబుపేట ఈద్గాలో వేలాదిగా తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు అఫిజ్ సయ్యద్ ఖాజా మోహిజొద్దీన్ ఖురాన్ చదివి దైవ సందేశమిచ్చారు. మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి వేర్వేరుగా హాజరై ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్‌తో పాటు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి



చిన్నారికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

తడుస్తూ.. ఎండుతూ!

- రైతులను వెంటాడుతున్న అకాల వర్షాలు
- కేంద్రాలకు కుప్పలు తెప్పలుగా ధాన్యం
- ఇంకా ప్రారంభం కాని కొనుగోళ్లు



కొల్చారం మండలం వరిగుంతంలో పేరుకుపోయిన ధాన్యం



గవ్వపల్లిలో రోడ్డుపై ధాన్యం ఆరబెడుతున్న రైతు

మెదక్‌జోన్: అకాల వర్షాలు అన్నదాతలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. శుక్రవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షానికి పలు మండలాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. నేటికీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక పోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. ధాన్యం ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ కల్లాల్లోనే మగ్గుతున్నాయి.

- జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది 1.98 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా 4.43 లక్షల ధాన్యం దిగుబడి వస్తోందని అధికారులు అంచనా వేశారు.
- కాగా జిల్లాలో వరికోతలు ప్రారంభించి 20 రోజులు అవుతుండగా.. 40 శాతం కోతలు పూర్తి చేశారు.
- ధాన్యాన్ని కల్లాలు, రోడ్ల వెంట ఆరబెడుతున్నారు. కొనుగోలు కేంద్రాలకు సైతం పెద్ద ఎత్తున ధాన్యం తరలిస్తున్నారు.
- నేటికీ అధికారులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించక పోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

420 కేంద్రాలకు.. తెరిచింది ఒక్కటే

- జిల్లావ్యాప్తంగా 4.43 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేసిన అధికారులు అందుకనుగుణంగా 420 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు.
- కానీ ఇప్పటివరకు పాపన్నపేట మండలం ఎల్లాపూర్‌లో మాత్రమే కలెక్టర్ రాజర్షిషా చేతుల మీదుగా కొనుగోలు కేంద్రం ప్రారంభించారు.
- ఇప్పటికే అధికారులతో కలెక్టర్ సమావేశం ఏర్పాటు చేసి ఏప్రిల్ మూడో వారం వరకు మొత్తం కేంద్రాలను ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశారు.
- మెదక్, హవేళిఘనాపూర్, కొల్చారం, పాపన్నపేట, చిన్నశంకరంపేట, చేగుంట, రామాయంపేట, నర్సాపూర్, తదితర మండలాల్లో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చి రాశులు పోశారు.
- అకాల వర్షాలతో ఇప్పటికే మూడు సార్లు ధాన్యం తడిసి ముద్దయింది. కూలీలతో ఆరబెడుతుండడంతో అదనపు భారం పడతుందని రైతులు వాపోతున్నారు.
- ఉదయం ఎండ..రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తుండడంతో అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అద్దె టార్పాలిన్లే దిక్కు

- కొనుగోలు కేంద్రాలకు పేరుకే టార్పాలిన్లు సరఫరా చేస్తున్నారు. ఒక్కో కేంద్రానికి వందల సంఖ్యలో ధాన్యం వస్తుంటే కేవలం పదుల సంఖ్యలో మాత్రమే టార్పాలిన్లు ఇస్తున్నారు.
- దీంతో చేసేది లేక రైతులు ఒక్కో టార్పాలిన్‌కు రోజుకు రూ. 15 నుంచి రూ. 20 వరకు అద్దె చెల్లించి ధాన్యంపై కప్పుతున్నారు.
- ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాలకు సరిపడా టార్పాలిన్లు ఇవ్వాలని పలు మండలాల రైతులు కోరుతున్నారు.

రెండు సార్లు ధాన్యం తడిసింది



రెండెకరాల్లో వరి సాగు చేశాను. వారం క్రితం వరి కోసి రోడ్డుపై ధాన్యం ఆరబెట్టగా అకాల వర్షాలతో ఇప్పటికే రెండు సార్లు తడిసి ముద్దయింది. దీంతో కూలీలను పెట్టి ఆరబెట్టాను.

– లచ్యా, జంగరాయి తండా

13 రోజులు అవుతుంది



ఎకరంన్నర పొలంలో వరిసాగు చేశాను. 20 రోజుల క్రితం కోత కోసి ఆరబెట్టాను. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకు వచ్చి 13 రోజులు అవుతుంది. ఇప్పటికీ కొనుగోళ్లు ప్రారంభించ లేదు.

– శ్రీనివాస్‌రెడ్డి, రైతు, జంగరాయి గ్రామం



చిన్నశంకరంపేట: రుద్రారంలో వర్షానికి తడిసిన ధాన్యం

వదలని వాన

మెదక్‌జోన్: అకాల వర్షాలు రైతన్నను వెంటాడుతూనే ఉన్నాయి. శనివారం సాయంత్రం చిన్నశంకరంపేట, రామాయంపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ఆరబెట్టిన ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. తెరుకున్న రైతులు రాశులపై టార్పాలిన్లు కప్పారు. అయినా కొంతమేర ధాన్యం తడిసిపోగా ఆందోళనకు గురయ్యారు.



రామాయంపేట: మార్కెట్ యార్డులో వరద నీటిలో ధాన్యం

నేడు గురుకుల ప్రవేశ పరీక్ష

మెదక్ మున్సిపాలిటీ: ఉమ్మడి గురుకులాల ప్రవేశం కోసం నేడు (ఆదివారం) పరీక్షలు నిర్వహిస్తున్నామని జిల్లా సమన్వయ అధికారిణి వరలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకొని సమయానికి పరీక్షకు హాజరు కావాలని పేర్కొన్నారు. వెంట బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్నులు, ఎగ్జామ్ ప్యాడ్, హాల్‌టికెట్ మాత్రమే తెచ్చుకోవాలన్నారు. గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని.. తల్లిదండ్రులు సురక్షితంగా పిల్లలను సెంటర్‌కు తీసుకువచ్చి పరీక్ష రాయించాలని సూచించారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల, మెదక్, రామాయంపేట, కొల్చారం కేంద్రాల్లో విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు చెప్పారు.

ప్రతీ గింజను మేమే కొంటాం

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభంలో మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటఅర్బన్: రైతు శ్రేయస్సే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ముందుకు సాగుతున్నారని, యాసంగిలో రైతులు పండించిన ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూరులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో ఈ సీజన్‌లో మొదటి కొనుగోలు కేంద్రాన్ని వెల్కటూరులో ప్రారంభించామన్నారు. కేంద్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లకు ముందుకు రాకున్నా సీఎం కేసీఆర్ కేంద్రాలను ఏర్పాటు చేశారని అన్నారు. ధాన్యం సేకరణలో ఇబ్బందులు లేకుండా చూడాలని పౌర సరఫరాల శాఖ అధికారులు, తహసీల్దార్‌ను ఆదేశించారు. కొనుగోళ్లు పూర్తయిన రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి, డీఆర్‌డీఓ చంద్రమోహన్ రెడ్డి, సర్పంచ్ ఎల్లవ్వ పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు

మురుగు.. పరుగు



నర్సాపూర్: పట్టణంలోని నర్సాపూర్–సంగారెడ్డి జాతీయ రహదారిపై నుంచి మురుగు నీరు పారుతోంది. దీంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. పైప్‌లైన్ పాడవడంతో మురికి నీరు రోడ్డుపై పారుతుండగా.. వాహనదారులు, కాలినడకన వెళ్లే వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారులు పైప్‌లైన్‌కు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి



సునీతారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

నర్సాపూర్: ఉద్యోగుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. శనివారం నర్సాపూర్, శివ్వంపేట, కౌడిపల్లి మండలాలకు చెందిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఆమెను కలిసి తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సునీతారెడ్డి మాట్లాడుతూ.. మీ సమస్య సీఎం కేసీఆర్ దృష్టిలో ఉందని.. ఖచ్చితంగా న్యాయం చేస్తారన్న నమ్మకం ఉందన్నారు. రాష్ట్ర ఆర్థిక, పంచాయతీ రాజ్ శాఖ మంత్రుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో సునీతారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, నాగరాజు, చంద్రశేఖర్, సౌజన్య, శైలజ, వీణ, కవిత, తదితరులు పాల్గొన్నారు.

పుష్కర స్నానం.. పునీతం

- వైభవోపేతంగా గరుడ గంగ పుష్కరాలు
- ప్రారంభించిన మాధవానంద సరస్వతి



గంగమ్మకు సారె పెట్టి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ రూరల్: గరుడ గంగ మంజీరా పుష్కరాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మెదక్ మండలం పేరూరు శివారులో ఉత్తరవాహినిగా ప్రవహిస్తున్న గరుడ గంగా మంజీరా నది వద్ద కొనసాగుతున్న గంగ పుష్కరాలను రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి శనివారం లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మంజునాథ స్వామికి అభిషేకం చేశారు. ఈసందర్భంగా పుష్కర దేవతకు 108 కలశాలతో అభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో 20 అడుగుల ఎత్తులో మంజునాథుడు పైకి రావడం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. ప్రత్యేక పూజలు చేసి పితృదేవతలకు పిండ ప్రదానం చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. నదిలో స్నానం చేయలేని వారి కోసం ప్రత్యేకంగా షవర్లను ఏర్పాటు చేశారు. అన్నదాన కార్యక్రమంతో పాటు తాగు నీటి సౌకర్యం, మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక గదులను తాత్కాలికంగా ఏర్పాటు చేశారు.

ప్రముఖుల పుణ్యస్నానాలు

గరుడ గంగా పుష్కరాలు 12 రోజుల పాటు కొనసాగనుండగా తొలిరోజు మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు పుష్కరాలకు హాజరుకాగా నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పుష్కర ఘాట్ వద్ద ప్రత్యేక పూజలు చేసి గంగమ్మకు సారె పెట్టారు. అలాగే ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి దంపతులు భక్తులతో పాటు పుష్కర స్నానం ఆచరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణాలో గరుడ గంగ పుష్కరాలను వైభవంగా నిర్వహించుకోవడం గర్వకారణంగా ఉందన్నారు. మంజీర నది తీరంలో సర్పయాగ ఫలాల ఆనవాళ్లు కనిపిస్తున్నాయని, ఏడుపాయల వనదుర్గా భవాని మంజీరా నాథాలు సైతం ఇక్కడి నుంచే ప్రవహిస్తున్నట్లు చెప్పారు.



పుష్కర స్నానం ఆచరిస్తున్న ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి దంపతులు, భక్తులు

ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ.. 12 ఏళ్ల తర్వాత మరోసారి పుష్కరాలు ప్రారంభం కావడం సంతోషంగా ఉందన్నారు.

క్లుప్తంగా

నిబంధనలకు విరుద్ధంగా నంబర్‌ ప్లేట్లు వాడొద్దు



సిద్దిపేట సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్‌: నిబంధనలకు విరుద్ధంగా వాహనాల నంబరు ప్లేట్లు ఉంటే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సిద్దిపేట పోలీస్‌ కమిషనర్‌ ఎన్‌. శ్వేత తెలిపారు. సిద్దిపేట, గజ్వేల్‌, దుబ్బాక, హుస్నాబాద్‌, చేర్యాల పట్టణాల్లో కొంతమంది వాహనదారులు ఆర్టీఓ నిర్దేశించిన నంబర్‌ ప్లేట్‌ కాకుండా ఎగుడుదిగుడు నంబర్‌ ప్లేట్లు, మార్ఫింగ్‌ చేయడం, నంబర్‌ ప్లేట్‌ లేకుండా వాహనాలు నడుపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పోలీసు సిబ్బందితో రెండు, మూడు రోజుల్లో స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహించి కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రతివాహన దారుడు రోడ్డు, ట్రాఫిక్‌ నిబంధనలు పాటించి వాహనాలు నడపాలన్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి.. చెరువులో శవమై



ఫరీద్‌ మృతదేహం

మనోహరాబాద్‌(తూప్రాన్‌): చేపలు పట్టడానికి వెళ్లిన ఓ వ్యక్తి చెరువులో శవమై కనిపించాడు. శనివారం ఎస్‌ఐ సందీప్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మనోహరాబాద్‌ మండల కేంద్రానికి చెందిన షేక్‌ జాఫర్‌ కుమారుడు ఫరీద్‌ (33) శుక్రవారం గ్రామ ఎల్లమ్మ చెరువు వద్ద చేపలు పట్టడానికి వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి తిరిగిరాలేదు. కాగా శనివారం రంజాన్‌ పండగ వేళ చెరువులో శవమై తేలాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడు హమాలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. మృతుడికి భార్య నజీయాబేగం, ఇద్దరు పిల్లలున్నారు.

గజ్వేల్‌ ప్రభుత్వాస్పత్రిలో క్షతగాత్రులకు చికిత్స

గజ్వేల్‌రూరల్‌: అస్థికలను కలిపేందుకు వెళ్లి జగిత్యాల జిల్లాలో గాయపడిన వారిలో కొందరు గజ్వేల్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ధర్మపురి సమీపంలోని కొత్తపేట గ్రామం వద్ద జరిగిన ఈ ప్రమాదంలో మొత్తం 25మంది గాయపడగా, వారిలో ఏడుగురు శనివారం గజ్వేల్‌కు చేరుకున్నారు. మిగతా వారు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

కొమురవెల్లి రైల్వేస్టేషన్‌కు గ్రీన్‌సిగ్నల్‌



కొత్తపల్లి -మనోహరాబాద్‌ రైల్వేలైన్‌లో భాగంగా కొమురవెల్లి శివారులో ఏర్పాటు చేసిన గార్డు రూం

కొమురవెల్లి(సిద్దిపేట): కొత్తగా నిర్మిస్తున్న మనోహరాబాద్‌-కొత్తపల్లి రైల్వేలైన్‌లో కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ సమీపంలో రైల్వే స్టేషన్‌ ఏర్పాటుకు కేంద్రం ఎట్టకేలకు పచ్చజెండా ఊపింది. మల్లన్న దర్శనానికి వచ్చే భక్తులకు ఇది ఊరట కల్పించే విషయమే.

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్‌ ఎంపీ బండి సంజయ్‌ కేంద్ర రైల్వే మంత్రిని ఢిల్లీలో కలిశారు. కొమురవెల్లిలో రైల్వేస్టేషన్‌ ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్‌ సానుకూలంగా స్పందించి కొమురవెల్లిలో రైల్వేస్టేషన్‌ ఏర్పాటు చేయాలని రైల్వే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.
- కొమురవెల్లి ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కావడంతో నిత్యం రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిమంది భక్తులు మల్లన్న దర్శనానికి వస్తారు.
- కొత్తగా ఏర్పాటు చేస్తున్నే ఈ రూట్‌లో కొమురవెల్లిలో రైల్వేస్టేషన్‌ ఏర్పాటు చేయాలని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆలయ చైర్మన్‌ గీస భిక్షపతి, గ్రామ సర్పంచ్‌ సార్ల లతలు రైల్వే మంత్రికి పలుమార్లు విన్నవించారు.
- కొమురవెల్లికి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న దుద్దెడ, 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న లకుడారం రైల్వేస్టేషన్లు ఏర్పాటు చేస్తున్న సమయంలోనే కొమురవెల్లి శివారులో రైల్వేస్టేషన్‌ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ తెరపైకి వచ్చింది.
- కనీసం హాల్ట్‌స్టేషన్‌ అయినా ఏర్పాటు చేయాలని స్థానికులు, భక్తులు రైల్వే అధికారులకు విన్నవించారు.
- కొమురవెల్లి పరిసరాలు రైల్వేలైన్‌లో స్కిప్పర్‌ జోన్‌లో ఉందనే సాంకేతిక కారణాలు చెబుతూ రైల్వేస్టేషన్‌ ఏర్పాటుకు విముఖత వ్యక్తం చేశారు.
- కొద్దిరోజుల క్రితం మల్లన్న దర్శనానికి వచ్చిన గవర్నర్‌ తమిళిసై, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌లు రైల్వే మంత్రి, అధికారులతో స్టేషన్‌ ఏర్పాటు విషయం మాట్లాడారు.
- తాజాగా బండి సంజయ్‌ ఢిల్లీ కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి కొమురవెల్లిలో రైల్వేస్టేషన్‌ ఆవశ్యతను వివరిండం, ఆయన సానుకూలంగా వ్యవహరించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంతోషంగా ఉంది



కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ సమీపంలో రైల్వేస్టేషన్‌ ఏర్పాటుకు కేంద్ర అనుమతించడం సంతోషించదగ్గ విషయం. ఆలయ సమీపంలో వ్యాపారం చేసేవారికి, భక్తులకు రాకపోకలకు ఇబ్బందులు తొలగిపోతాయి.

–కొండ శ్రీధర్‌, స్థానికుడు

భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుంది



కొమురవెల్లి మల్లికార్జునస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు చాలా సౌకర్యవంతంగా ఉంటుంది. కొమురవెల్లిలో రైల్వేస్టేషన్‌ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నాం.

–గీస భిక్షపతి, ఆలయ చైర్మన్‌

డీసీఎంను ఢీకొన్న కారు

అక్కడికక్కడే ఒకరి మృతి



బాలాజీపవన్‌ మృతదేహం

పటాన్‌చెరు టౌన్‌: ముందు వెళుతున్న ఓ డీసీఎంను వెనుక నుంచి వచ్చిన ఓ కారు ఢీకొట్టింది. ఈ ఘటనలోఒకరికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన భానూర్‌-బీడీఎల్‌ పోలీసు స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. బీడీఎల్‌ హెడ్‌కానిస్టేబుల్‌ రవీందర్‌ తెలిపిన వివరాల ప్రకారం...అమీన్‌పూర్‌ మండల పరిధిలోని కిష్టారెడ్డిపేటకు చెందిన బాలాజీపవన్‌(38) శనివారం తెల్లవారుజామున వెలమెల గ్రామశివారు ఓఆర్‌ఆర్‌పై ముందు వెళుతున్న డీసీఎంను తన కారుతో ఢీకొట్టాడు. ఈ ఘటనలో బాలాజీ పవన్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వరుసకు సోదరుడైన శ్రావణ్‌కుమార్‌ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రార్థనకు వెళుతుండగా తేనె టీగల దాడి



చిన్నారులను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్‌ ర్యాకల హేమలతాశేఖర్‌గౌడ్‌

మనోహరాబాద్‌(తూప్రాన్‌): రంజాన్‌ వేళ..పెద్దల సమాధి వద్దకు ప్రార్థనకు వెళ్లిన ఓ కుటుంబంపై తేనెటీగలు దాడి చేశాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మనోహరాబాద్‌ మండల కోఆప్షన్‌ మెంబర్‌ మునావర్‌ తన కుటుంబ సభ్యులతో శనివారం పెద్దల సమాధి వద్దకు ప్రార్థన చేయడానికి వెళ్లాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా తేనేటీగలు దాడి చేశాయి. ఈ ఘటనలో అఫ్జల్‌, మునావర్‌, గౌస్‌, ముదాసిర్‌, మంజూర్‌, ముస్తఫా, ముజాకీర్‌, తహ లు గాయపడ్డారు. వీరిలో ఇద్దరు చిన్నారులు ఉన్నా రు. కాగా మునావర్‌, అతడి తండ్రి అఫ్జల్‌ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. విషయం తెలియగానే జెడ్పీ చైర్‌ పర్సన్‌ ర్యాకల హేమలత మేడ్చల్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, వారిని పరామర్శించారు. ఆమె వెంట ఆత్మకమిటీ డైరక్టర్‌ భిక్షపతి, బండి నరేందర్‌గౌడ్‌ తదితరులున్నారు.

కలవడానికి ప్రయత్నిస్తే పట్టించుకోలేదని..



మాట్లాడుతున్న ఏసీపీ దేవారెడ్డి, పక్కన టూటౌన్‌ సీఐ రవికుమార్‌, ఎస్‌ఐ అమర్‌

సిద్దిపేటకమాన్‌: పట్టణంలోని ఫార్మర్స్‌ ఫస్ట్‌ ఫౌండేషన్‌ కార్యాలయంపై దాడికి యత్నించిన ఘటనలో పోలీసులు 24 గంటల్లోపే ఐదుగురు నిందితులను గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆ వివరాలను ఏసీపీ దేవారెడ్డి వెల్లడించారు. సీసీ ఫుటేజీలో నమోదైన బైక్‌ నంబర్ల ఆధారంగా ఐదుగురు నిందితులను గుర్తించినట్లు తెలిపారు. పట్టణానికి చెందిన కొట్టే నరేంద్ర అలియాస్‌ చందు, వరుకోలు విజయ్‌, బోనగిరి హరీష్‌, బూరుగు ఆదిత్యరామ్‌, బండి హర్షవర్ధన్‌లను నిందితులుగా గుర్తించి, వారిని అరెస్ట్‌ చేసి విచారించారు. చాలా రోజుల నుంచి చక్రధర్‌గౌడ్‌ను కలవడానికి వారు ప్రయతిన్నంచారన్నారు. ఆయన పట్టించుకోలేదని, దీంతో చక్రధర్‌ కార్యాలయంపై వారు దాడికి యత్నించారని ఏసీపీ తెలిపారు. నిందితుల నుంచి రెండు బైక్‌లు, ఐదు మొబైల్‌ ఫోన్‌లు రికవరీ చేసి శనివారం జ్యుడీషీయల్‌ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

గ్యాస్‌ సిలిండర్లు పేలి దుకాణం దగ్ధం



కాలిపోయిన దుకాణం

కంది(సంగారెడ్డి): గ్యాస్‌ సిలిండర్లు పేలి ఓ దుకాణం దగ్ధమైంది. ఈ సంఘటన మండల పరిధిలోని చిమ్నాపూర్‌ శివారులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం ... ఐఐటీ హైదరాబాద్‌ లో పనిచేసే కూలీలు నివాసం ఉండేందుకు చిమ్నాపూర్‌ సమీపంలో షెడ్లు ఏర్పాటు చేశారు. కూలీలకు అవసరమైన వంటగ్యాస్‌ చిన్న సిలిండర్లను అక్రమంగా కొందరు విక్రయిస్తున్నారు. ఈక్రమంలో శనివారం మధ్యాహ్నం అకస్మాత్తుగా మంటలురేగి సిలిండర్లు పేలి దుకాణం కాలిపోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

మంత్రి హరీశ్‌ చిత్రపటానికి క్షీరాభిషేకం

దుబ్బాక: పట్టణంలోని ముదిరాజ్‌ కమ్యూనిటీ హాల్‌కు మంత్రి హరీశ్‌ రావు రూ. 25 లక్షలు మంజూరు చేశారు. దీంతో ముదిరాజ్‌ సంఘం నాయకులు శనివారం హరీశ్‌ రావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ముదిరాజ్‌ సంఘం అధ్యక్షుడు మాడబోయిన రాజు నేతలు పర్స కృష్ణ, దేవుని రాజు, రవి, మునీందర్‌, నర్సయ్య, జంగిటి మల్లయ్య, రాములు, కనకయ్య పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభం

సిద్దిపేటరూరల్‌: నారాయణరావుపేట మండల పరిధిలోని మాటిండ్ల వద్ద కల్వర్టుల నిర్మాణ పనులను ఎంపీపీ బాలకృష్ణ, సర్పంచ్‌ కొంగరి నారాయణలు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ ఎంపీపీ సంతోష్‌, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు ఎల్లయ్య, కిషన్‌, ఉపసర్పంచ్‌ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న ఇద్దరు మృతి

వివరాలు తెలిస్తే చెప్పండి : సీఐ



మంజుల మృతదేహం

సదాశివపేట(సంగారెడ్డి): సంగారెడ్డి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందిందని సీఐ నవీన్‌కుమార్‌ తెలిపారు. ఈనెల 10వ తేదీన అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిందని, చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందిదన్నారు. ఆస్పత్రిలో చేరిన సమయంలో తన పేరు మంజుల(25) భర్త రాజు, నివాసం సదాశివపేటలోని హట్కర్‌పేటగా పేర్కొందన్నారు. శనివారం మృతురాలి గురించి ఆరా తీసినా, ఆమె బంధువుల జాడ తెలియలేదన్నారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే సదాశివపేట సీఐ (8712656721) ఫోన్‌లో సంప్రదించాలన్నారు.

మరో ఘటనలో వ్యక్తి మృతి

సదాశివపేట(సంగారెడ్డి): సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 30 సంవత్సరాల వయస్సున్న వ్యక్తి మృతి చెందాడని సీఐ నవీన్‌కుమార్‌ శనివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం...65వ నంబరు జాతీయ రహదారి ఎస్‌ఎన్‌ ఫుడ్‌ కోర్టు సమీపంలో ఈనెల 17వ తేదీన గుర్తుతెలియని వాహనం ఢీకొన్ని గుర్తు తెలియని వ్యక్తిగాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. చికిత్స నిమిత్తం 108 వాహనంలో సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అయితే అతను చికిత్సకు సహకరించకుండా పిచ్చిపిచ్చిగా ప్రవర్తించాడు. వేషధారణ, ప్రవర్తనను బట్టి అతడు మతిస్థిమితం లేని వ్యక్తి అయ్యి ఉండొచ్చన్నారు. చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. మృతునికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే సదాశివపేట సీఐ (8712656721)ని ఫోన్‌లో సంప్రదించాలన్నారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అదృశ్యమై.. ఆపై హతమై

- పిట్లం చెరువులో బైక్‌ లభ్యం
- దుకాణంలో మృతదేహం.. దుర్వాసనతో బయటపడిన వైనం



శ్రీనివాస్‌ మృతదేహం

మెదక్‌ మున్సిపాలిటీ: గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో ఒకరు దారుణ హత్యకు గురైన సంఘటన మెదక్‌ పట్టణ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో శనివారం వెలుగులోకి వచ్చింది. పట్టణ సీఐ సంజయ్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని గాంధీనగర్‌వీధికి చెందిన పొట్టిపల్లి శ్రీనివాస్‌(50) పెద్ద బజార్‌లో కుట్టుమిషన్ల రిపేర్‌ దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 20వ తేదీ బయటకు వెళ్లిన శ్రీనివాస్‌ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో అతని భార్య సంతోష పట్టణ పోలీస్‌ స్టేషన్‌ ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్‌ కేసు నమోదు చేశారు. అయితే శనివారం శ్రీనివాస్‌కు సంబంధించిన బైక్‌ పిట్లం చెరువులో లభ్యమైంది. దాని ఆధారంగా పోలీసులు మృతుడి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. ఇదే క్రమంలో శ్రీనివాస్‌ నడిపించే దుకాణంలో నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. బయట తాళం వేసి ఉండటంతో దాన్ని పగులగొట్టి పోలీసులు చూడగా శ్రీనివాస్‌ తలకు బలమైన గాయాలు తగిలి మృతి చెంది ఉన్నాడు. సంఘటన స్థలానికి మెదక్‌ డీఎస్పీ చేరుకొని వివరాలు సేకరించారు. అనంతరం పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వేధింపులు భరించలేక...



శ్రీలత(ఫైల్‌)

పాపన్నపేట (మెదక్‌): అత్తింటి వేధింపులు భరించ లేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ విజయకుమార్‌ కథనం ప్రకారం... మండలపరిధిలోనీ చీకోడ్‌ గ్రామానికి చెందిన బొయిని సంగమేశ్వర్‌- శ్రీలత(30) దంపతులకు ఇద్దరు పిల్లలు. కొద్దిరోజులుగా శ్రీలతను భర్త సంగమేశ్వర్‌, అత్త అనసూయ, మరిది సాయిబాబా అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్నారు. ఈ విషయమై పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయతీలు జరిగాయి. ఈ నెల 20వ తేదీన రూ.4లక్షలు ఇవ్వాలని భర్త సంగమేశ్వర్‌ తనను కొడుతున్నాడని శ్రీలత తన తండ్రి గోపాల్‌కు చెప్పింది. దీంతో గోపాల్‌ తన భార్యను తీసుకొని శుక్రవారం కూతురింటికి వచ్చాడు. సంగమేశ్వర్‌ మళ్లీ ముగ్గురితో గొడవ పడ్డాడు. గొడవ అనంతరం కూతురిని తన ఇంటికి తీసుకువెళతానని గోపాల్‌ కోరగా, సంగమేశ్వర్‌ అందుకు అంగీకరించలేదు. దీంతో వారు వెళ్లిపోయారు. మనస్తాపం చెందిన శ్రీలత రాత్రి సమయంలో ఇంట్లో ఓ దూలానికి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. శనివారం ఉదయం కుటుంబీకులు గమనించి గోపాల్‌కు సమాచారం అందించారు. మృతదేహాన్ని మెదక్‌ ఏరియా ఆస్పత్రికి తరలించారు. శ్రీలత తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాత్‌రూం బిర్యానీ

- సోషల్‌ మీడియాలో ట్రెండింగ్‌
- సిద్దిపేటలోని ఓ రెస్టారెంట్‌ నిర్వాకం



బాత్‌రూంలో బియ్యం ఉన్న బకెట్‌ ఇదే..

ప్రశాంత్‌నగర్‌ (సిద్దిపేట): ఘుమఘుమలాడే బిర్యానీ అంటే ఎవరికైనా ఇష్టమే.. కానీ బిర్యానీ తయారీకి ఉపయోగించే బియ్యం కడిగేది బాత్‌రూంలోని నీటితో అని తెలిస్తే?.. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఓ రెస్టారెంట్‌లో బిర్యానీకి ఉపయోగించే బియ్యాన్ని బాత్‌రూంలోని నీటితో శుభ్రపరుస్తున్నారు. దీన్ని ఓ వినియోగదారుడు వీడియో తీసి సోషల్‌ మీడియాలో పెట్టడంతో వైరల్‌ అయ్యింది. ఈ వీడియోలో.. ఎందుకు బాత్‌రూంలో బిర్యానీ బియ్యం కడుగుతున్నారని నిర్వాహకుల్ని వినియోగదారుడు ప్రశ్నిస్తే.. నీటి సమస్య వల్ల ఇలా చేస్తున్నట్లు ఇచ్చిన సమాధానం స్పష్టంగా వినిపిస్తోంది. దీంతో నెటిజన్లు.. 'బొంగు బిర్యానీ, బకెట్‌ బిర్యానీ, కుండ బిర్యానీ, బిందె బిర్యానీ, స్టీల్‌ డబ్బా బిర్యానీ.. ఇలా చాలా రకాలను మీరు చూసి ఉంటారు.. కానీ మా సిద్దిపేటలో సరికొత్త బిర్యానీ ఆవిష్కరించారు.. అదే బాత్‌రూం బిర్యానీ.. తినండి సూపర్‌ టేస్ట్‌'.. అంటూ.. సోషల్‌మీడియాలో సెటైర్లు విసురుతున్నారు.

పోయిన సెల్‌ దొరికింది

దుబ్బాకరూరల్‌: అక్బర్‌పేట భూంపల్లి మండలం నగరం గ్రామానికి చెందిన రవి గత డిసెంబర్‌లో తన సెల్‌ఫోన్‌ పోగొట్టుకున్నారు. సెంట్రల్‌ ఎక్విప్‌మెంట్‌ ఐడెంటిటీ రిజిస్టర్‌ అందుబాటులోకి వచ్చాక, ఆ వైబ్‌సైట్‌లో ఫిర్యాదు చేశాడు. శనివారం ఉదయం పోగొట్టుకున్న ఫోన్‌ ఐఎంఈఐ నంబర్‌ ఎంటర్‌ చేసి బ్లాక్‌ చేశారు. అయితే ఫోన్‌ దొరికిన వ్యక్తి అందులో సిమ్‌ వేయగా, ఆ సమాచారం పోలీసులకు చేరింది. ఆ వ్యక్తి నుంచి ఫోన్‌ స్వాధీనం చేసుకుని రవికి ఎస్‌ఐ గంగరాజు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ భిక్యానాయక్‌, హరికృష్ణ, వినిత తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్రలో గీతకార్మికుడి మృతి



సురేష్‌ (ఫైల్‌)

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని ఓబులాపూర్‌ గ్రామానికి చెందిన గీత కార్మికుడు మహారాష్ట్రలో తాటిచెట్టుపై నుంచి పడి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చెవుల సురేష్‌గౌడ్‌(39)కి భార్య రేణుక, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. స్థానికంగా ఉపాధి లేకపోవడం, కుటుంబ పోషణకు మహారాష్ట్రలోని చంద్రాపూర్‌లోని బంధువుల వద్దకు తాళ్లు గీయడానికి వెళ్లాడు. ఈ క్రమంలో శుక్రవారం తాటి చెట్టుపై నుంచి కింద పడిపోయాడు. బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం సురేష్‌ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. కుటుంబపెద్ద మృతి చెందడంతో భార్య, పిల్లల రోదనలు గ్రామస్తులను కలచివేశాయి. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు రూ. 50 వేల ఆర్థిక సాయాన్ని ఎంపీపీ మాణిక్యరెడ్డి, బీఆర్‌ఎస్‌ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ, సర్పంచ్‌ ఐలయ్యల చేతుల మీదుగా మృతుడి కుటుంబానికి అందజేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



రవి(ఫైల్‌)

పాపన్నపేట(మెదక్‌): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి నీట మునిగి మృతి చెందాడు. ఎస్‌ఐ విజయకుమార్‌ కథనం ప్రకారం..మండలపరిధిలోని దూమ్లాతండాకు చెందిన ధరావత్‌ రవి (28) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొన్నేళ్ల నుంచి మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం బాగా మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. దీంతో భార్య లలిత అతడిని మందలించింది. అనంతరం భోజనం చేసిన తర్వాత బయటకు వెళ్లాడు. రాత్రయినా తిరిగి రాలేదు. భార్య చుట్టూ పక్కల వెతికింది. అయినా ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం అర్కెల గ్రామ శివారులోని చెరువు తూము వద్ద రవి బైక్‌, చెప్పులు ఉన్నాయని అటుగా వెళ్లిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. అక్కడకు వెళ్లి చూడగా, చెరువు నీటిలో రవి మృతదేహం తేలియాడుతూ కనిపించింది. పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు ఘటనాస్థలికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్‌ ఏరియా ఆస్పత్రికి తరలించారు. తన భర్త మృతి పట్ల అనుమానం ఉందని భార్య లలిత ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

స్వచ్ఛబడిలో ధరిత్రి దినోత్సవం



సిద్దిపేటజోన్‌: జిల్లా కేంద్రంలోని స్వచ్ఛ బడిలో శనివారం ధరిత్రి దినోత్సవం (ఎర్త్‌ డే) ఘనంగా నిర్వహించారు. మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మంజుల, కమిషనర్‌ సంపత్‌ పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ గురించి వివరించారు. అనంతరం హోం కంపోస్టు ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇన్వెస్ట్‌ ఇన్‌ అవర్‌ ప్లానెట్‌ ఇతివృతంగా సంగారెడ్డి జిల్లా ముక్తాపూర్‌ గ్రామానికి చెందిన పర్యావరణ ప్రేమికుడు జ్ఞానేశ్వర్‌ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ విత్తన బంతులు తయారీ, చెట్లను కాపాడే ప్రక్రియలను వివరించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ బడి నిర్వహకులు దీప్తి, స్వామి పాల్గొన్నారు.

సెమీస్‌లో ఓడిన సాకేత్-యూకీ జోడీ



జీఎండబ్ల్యూ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో సాకేత్ మైనేని-యూకీ బాంబ్రీ (భారత్) పోరాటం ముగిసింది. జర్మనీలోని మ్యూనిక్‌లో శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో సాకేత్-యూకీ జంటకు ఓటమి ఎదురైంది. 84 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో సాకేత్-యూకీ 6-7 (4/7), 3-6తో అలెగ్జాండర్ ఎర్లెర్-లుకాస్ మీడ్లెర్ (ఆస్ట్రియా) చేతిలో ఓడిపోయారు. మ్యాచ్ మొత్తంలో ఐదు ఏస్‌లు సంధించిన సాకేత్, యూకీ ఐదు డబుల్ ఫాల్ట్‌లు కూడా చేయడం గమనార్హం. భారత జోడీ ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేసి తమ సర్వీస్‌ను రెండు సార్లు కోల్పోయింది. సెమీస్‌లో ఓడిన సాకేత్-యూకీలకు 9,330 యూరోల (రూ. 8 లక్షల 47 వేలు)ప్రైజ్‌మనీతోపాటు 90 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

సురేఖ 'డబుల్' ధమాకా



స్వర్ణాలు సాధించినందుకు చాలా ఆనందంగా ఉంది. నా అనుభూతిని మాటల్లో వర్ణించలేను. నేనీ స్థాయికి చేరుకోవడానికి ఎంతో మంది కృషి ఉంది. వారందరికీ ధన్యవాదాలు. ఈ సీజన్‌లో మరో మూడు ప్రపంచకప్‌లు, ప్రపంచకప్ ఫైనల్స్, ప్రపంచ చాంపియన్‌షిప్, ఆసియా క్రీడలు ఉన్నాయి. ఈ మెగా ఈవెంట్స్‌లోనూ పతకాలు సాధించడమే నా లక్ష్యం. - సురేఖ

2 ప్రపంచకప్ టోర్నీ వ్యక్తిగత విభాగంలో సురేఖ సాధించిన పతకాలు. 2022లో సురేఖ రజతం నెగ్గగా, ఈసారి స్వర్ణం సాధించింది.

11 ప్రపంచకప్ టోర్నీలలో ఓవరాల్‌గా సురేఖ నెగ్గిన పతకాలు. ఇందులో మూడు స్వర్ణాలు, మూడు రజతాలు, నాలుగు కాంస్యాలు ఉన్నాయి.

2 ప్రపంచకప్ టోర్నీల్లో మిక్స్‌డ్ టీమ్‌లో సురేఖ నెగ్గిన స్వర్ణాలు. 2022లో అభిషేక్ వర్మతో కలిసి తొలిసారి స్వర్ణం గెలిచింది.

ప్రపంచకప్ ఆర్చరీ టోర్నీలో రెండు స్వర్ణ పతకాలు నెగ్గిన ఆంధ్రప్రదేశ్ అమ్మాయి



అంటాల్యా (తుర్కియే): ఆద్యంతం నిలకడగా రాణించిన భారత స్టార్ ఆర్చర్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ తన కెరీర్‌లో గొప్ప ప్రదర్శన చేసింది. సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ... ఎన్నో ఏళ్లుగా ఊరిస్తున్న ప్రపంచకప్ టోర్నీ వ్యక్తిగత స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. శనివారం జరిగిన ఈవెంట్స్‌లో విజయవాడకు చెందిన 26 ఏళ్ల జ్యోతి సురేఖ గురి తప్పని లక్ష్యంతో మెరిపించి ఏకంగా రెండు స్వర్ణ పతకాలను దక్కించుకొని డబుల్ ధమాకా సృష్టించింది. ముందుగా కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో తొలిసారి ప్రపంచకప్ టోర్నీలో ఆడుతున్న ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలె (మహారాష్ట్ర)తో కలిసి పసిడి పతకాన్ని సాధించింది. చెన్ యి సువాన్-చెన్ చి లున్ (చైనీస్ తైపీ) జోడీతో జరిగిన ఫైనల్లో జ్యోతి సురేఖ-ఓజస్ ప్రవీణ్ 159-154 పాయింట్ల తేడాతో గెలిచింది. తొలి మూడు రౌండ్‌లలో 40కి 40 పాయింట్లు స్కోరు చేసిన భారత జోడీ చివరి రౌండ్‌లో 39 పాయింట్లు సాధించింది. ఒక పాయింట్ తేడాతో ప్రపంచ రికార్డును సమం చేసే అవకాశాన్ని చేజార్చుకుంది. 2018లో అంటాల్యాలోనే జరిగిన ప్రపంచకప్‌లో దక్షిణ కొరియా జట్టు 160కి 160 పాయింట్లు స్కోరు చేసింది.

వరల్డ్ నంబర్‌వన్‌ను ఓడించి...

మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో జ్యోతి సురేఖ ప్రపంచకప్ టోర్నీల చరిత్రలో తొలిసారి పసిడి పతకాన్ని ముద్దాడింది. శనివారం జరిగిన ఫైనల్లో ప్రపంచ 11వ ర్యాంకర్ సురేఖ 149-146తో (30-30, 30-29, 29-29, 30-29, 30-29) ప్రపంచ మూడో ర్యాంకర్ సారా లోపెజ్ (కొలంబియా)పై గెలిచి 20వ ప్రయత్నంలో చాంపియన్‌గా అవతరించింది. 2011 నుంచి అంతర్జాతీయ టోర్నీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న సురేఖ సెమీఫైనల్లో 148-146తో (29-29, 30-30, 30-30, 29-29, 30-28) ప్రపంచ నంబర్‌వన్ ఇలా గిబ్సన్ (బ్రిటన్)పై సంచలన విజయం సాధించింది.

లక్నో చేజేతులా...

గెలిచే దారిలో ఓటమిని పిలవడం అంటే ఇదే! 19 ఓవర్లలో లక్నో స్కోరు 124/3. ఇంకా 7 వికెట్లున్న జట్టు 6 బంతుల్లో 12 పరుగులు చేస్తే చాలు. పైగా తొలి ఓవర్ నుంచి ఆడుతున్న ఓపెనర్ కేఎల్ రాహుల్ అర్ధసెంచరీ చేసి క్రీజులో ఉన్నాడు. ఆఖరి ఓవర్ మొదటి బంతికి 2 పరుగులు కూడా చేశాడు. 5 బంతుల్లో 10 పరుగులు సులభంగానే కనిపించింది. కానీ మోహిత్ శర్మ వేసిన తర్వాతి 2 బంతులు రాహుల్, స్టొయినిస్‌లను బోల్తా కొట్టించాయి. ఇంకో 2 బంతులకు ఆయుశ్ బదోని, దీపక్ హుడా రనౌటయ్యారు. అంతే ఆఖరి బంతి మిగిలుంది కానీ... టైటాన్స్ గెలిచింది! సమీకరణం 1 బంతికి 8 పరుగులు కాగా... మోహిత్ కనీసం ఒక పరుగైనా ఇవ్వలేదు. దీంతో ఎవరూహించని విజయం గుజరాత్ గూటికి చేరింది.

- నెగ్గాల్సిన మ్యాచ్‌లో 7 పరుగులతో ఓటమి
- ఆఖరి ఓవర్లో గుజరాత్‌ను గెలిపించిన మోహిత్
- రాహుల్ శ్రమ వృథా
- రాణించిన పాండ్యా, సాహా



ఆయుశ్ బదోనిని రనౌట్ చేస్తున్న మోహిత్ శర్మ

లక్నో: మోహిత్ శర్మ స్వింగ్ (2/17)తో గుజరాత్ టైటాన్స్ కింగ్ అయ్యింది. అనూహ్యంగా ఓటమి కోరల్లోంచి గెలుపు మజిలీకి చేరింది. అలవోకగా గెలవాల్సిన చోట లక్నో సూపర్ జెయింట్స్ వరుస నాలుగు బంతుల్లో నాలుగు వికెట్లు చేజార్చుకొని ఓటమిని పలకరించింది. మొదట గుజరాత్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 135 పరుగులు చేసింది. కెప్టెన్ హార్దిక్ పాండ్యా (50 బంతుల్లో 66; 2 ఫోర్లు, 4 సిక్సర్లు), వృద్ధిమాన్ సాహా (37 బంతుల్లో 47; 6 ఫోర్లు) రాణించారు. లక్నో బౌలర్లలో కృనాల్ పాండ్యా, స్టొయినిస్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన లక్నో సూపర్ జెయింట్స్ 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 128 పరుగులకే పరిమితమైంది. కెప్టెన్ కేఎల్ రాహుల్ (61 బంతుల్లో 68; 8 ఫోర్లు) పోరాటం జట్టును గెలిపించలేకపోయింది. మోహిత్ శర్మకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' లభించింది.

కెప్టెన్ ఇన్నింగ్స్...

సాహాతో శుబ్‌మన్ గిల్ (0) 'ఇంపాక్ట్' డకౌటైంది. వన్‌డౌన్‌లో కెప్టెన్ హార్దిక్ పాండ్యా అండతో సాహా బౌండరీలతో టైటాన్స్ స్కోరును కదిలించాడు. ఈ జోడీ పవర్‌ప్లేలో 40 పరుగులు చేసింది. ఆ తర్వాత అడపాదడపా ఫోర్లతో 10 ఓవర్ల దాకా వికెట్‌ను కాపాడుకున్నారు. జట్టు స్కోరు 72 వద్ద సాహాను కృనాల్ పాండ్యా అవుట్ చేయగా... తర్వాత వచ్చిన అభినవ్ (3), విజయ్ శంకర్ (10) నిరాశపరచడంతో పెద్ద స్కోరేం కాలేదు. ఆఖరి ఓవర్లలో హార్దిక్ భారీ సిక్సర్లతో స్కోరు పెంచే ప్రయత్నం చేశాడు. 44 బంతుల్లో ఫిఫ్టీ పూర్తిచేసుకున్న పాండ్యా ఆఖరి ఓవర్లో నిష్క్రమించాడు.



కేఎల్ రాహుల్

రాహుల్ ఒంటరి పోరాటం...

లక్నో ముందున్న లక్ష్యం 136 పరుగులు. కష్టమైందో... కఠినమైందో కానే కాదు! ఓపెనింగ్ జోడీ కెప్టెన్ రాహుల్, కైల్ మేయర్స్ (19 బంతుల్లో 24; 2 ఫోర్లు, 1 సిక్స్) పవర్ ప్లేలోనే 53 పరుగులు చేయడంతో లక్ష్యఛేదన సులువుగా సాగింది. మేయర్స్ తర్వాత కృనాల్ పాండ్యా (23 బంతుల్లో 23; 2 ఫోర్లు, 1 సిక్స్) అవుటయ్యేసరికే జట్టు 100 పరుగులను దాటింది. నికోలస్ పూరన్ (1) విఫలమైనా... రాహుల్ క్రీజును అట్టిపెట్టుకోవడంతో ఎవరికీ ఏ బెంగా లేదు. రాహుల్ 38 బంతుల్లో అర్ధశతకం సాధించాడు. ఆఖరి ఓవర్‌కు ముందు 124/3 స్కోరుతో లక్నో పటిష్టంగా ఉంది. కానీ ఆ తర్వాతే మోహిత్ చివరి ఓవర్ అనూహ్యంగా సూపర్ జెయింట్స్‌ను ఓడించింది. కచ్చితత్వం లేని షాట్లతో రాహుల్, స్టొయినిస్ (0)వికెట్లను పారేసుకుంటే... పరుగుల వేటలో ఆయుశ్ బదోని (8), దీపక్ హుడా (2) రనౌటయ్యారు.

స్కోరు వివరాలు

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (సి) హుడా (బి) కృనాల్ 47; గిల్ (సి) బిష్ణోయ్ (బి) కృనాల్ 0; హార్దిక్ పాండ్యా (సి) రాహుల్ (బి) స్టొయినిస్ 66; అభినవ్ (సి) నవీనుల్ హఖ్ (బి) మిశ్రా 3; విజయ్ శంకర్ (బి) నవీనుల్ హఖ్ 10; మిల్లర్ (సి) హుడా (బి) స్టొయినిస్ 6; తెవాటియా (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 135. వికెట్ల పతనం:** 1-4, 2-72, 3-77, 4-92, 5-132, 6-135. **బౌలింగ్:** నవీనుల్ హఖ్ 4-0-19-1, కృనాల్ పాండ్యా 4-0-16-2, అవేశ్ ఖాన్ 3-0-21-0, రవి బిష్ణోయ్ 4-0-49-0, స్టొయినిస్ 3-0-20-2, అమిత్ మిశ్రా 2-0-9-1.

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: రాహుల్ (సి) జయంత్ (బి) మోహిత్ 68; మేయర్స్ (బి) రషీద్ ఖాన్ 24; కృనాల్ (స్టంప్డ్) సాహా (బి) నూర్ అహ్మద్ 23; పూరన్ (సి) హార్దిక్ (బి) నూర్ అహ్మద్ 1; బదోని (రనౌట్) 8; స్టొయినిస్ (సి) మిల్లర్ (బి) మోహిత్ 0; దీపక్ హుడా (రనౌట్) 2; ప్రేరక్ మన్కడ్ (నాటౌట్) 0; రవి బిష్ణోయ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 128. వికెట్ల పతనం:** 1-55, 2-106, 3-110, 4-126, 5-126, 6-127, 7-128. **బౌలింగ్:** షమీ 3-1-18-0, జయంత్ 4-0-26-0, రషీద్ ఖాన్ 4-0-33-1, మోహిత్ శర్మ 3-0-17-2, నూర్ అహ్మద్ 4-0-18-2, హార్దిక్ పాండ్యా 1-0-7-0, రాహుల్ తెవాటియా 1-0-8-0.

మెరుపుల్లో పంజాబ్‌దే గెలుపు

- అదరగొట్టిన స్యామ్ కరన్, హర్‌ప్రీత్
- కీలక వికెట్లు తీసిన అర్ష్ దీప్
- 13 పరుగులతో ముంబైపై పంజాబ్ కింగ్స్ గెలుపు
- గ్రీన్, సూర్యకుమార్ శ్రమ వృథా



స్యామ్ కరన్

ముంబై: మెరుపుల ప్రతాపంలో పంజాబ్ కింగ్స్ పైచేయి సాధించింది. 13 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్‌ను ఓడించింది. తొలుత పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 214 పరుగులు చేసింది. కెప్టెన్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్యామ్ కరన్ (29 బంతుల్లో 55; 5 ఫోర్లు, 4 సిక్సర్లు), హర్‌ప్రీత్ సింగ్ (28 బంతుల్లో 41; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరిపించారు. జితేశ్ శర్మ (7 బంతుల్లో 25; 4 సిక్సర్లు) ఆఖర్లో శివమెత్తాడు. గ్రీన్, పియూష్ చావ్లా రెండేసి వికెట్లు తీశారు. తర్వాత భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 201 పరుగులకు పరిమితమైంది. గ్రీన్ (43 బంతుల్లో 67; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), సూర్యకుమార్ (26 బంతుల్లో 57; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), రోహిత్ శర్మ (27 బంతుల్లో 44; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), టిమ్ డేవిడ్ (13 బంతుల్లో 25 నాటౌట్; 2 సిక్స్‌లు) చెలరేగారు. కానీ ఆఖరి ఓవర్ ఫినిషింగ్‌లో అర్ష్‌దీప్ (4/29) నిప్పులు చెరగడంతో ముంబై విజయానికి దూరమైంది. ముంబై గెలుపునకు ఆఖరి ఓవర్లో 16 పరుగులు కావాల్సి ఉండగా... అర్ష్‌దీప్ 2 పరుగులే ఇచ్చి తిలక్ వర్మ (3), నేహల్ వధేరా (0) వికెట్లను విరిచేశాడు.



అర్ష్‌దీప్

స్కోరు వివరాలు

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: షార్ట్ (సి) చావ్లా (బి) గ్రీన్ 11; ప్రభ్‌సిమ్రన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అర్జున్ 26; అథర్వ (బి) చావ్లా 29; లివింగ్‌స్టోన్ (స్టంప్డ్) కిషన్ (బి) చావ్లా 10; హర్‌ప్రీత్ (బి) గ్రీన్ 41; కరన్ (సి అండ్ బి) ఆర్చర్ 55; జితేశ్ (బి) బెహ్రెన్‌డార్ఫ్ 25; షారుక్ నాటౌట్ 0; హర్‌ప్రీత్ బ్రార్ రనౌట్ 5; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 214. వికెట్ల పతనం:** 1-18, 2-65, 3-82, 4-83, 5-175, 6-197, 7-209, 8-214. **బౌలింగ్:** అర్జున్ టెండూల్కర్ 3-0-48-1, బెహ్రెన్‌డార్ఫ్ 3-0-41-1, గ్రీన్ 4-0-41-2, ఆర్చర్ 4-0-42-1, పీయూష్ చావ్లా 3-0-15-2, హృతిక్ షోకీన్ 3-0-24-0.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి అండ్ బి) లివింగ్‌స్టోన్ 44; ఇషాన్ కిషన్ (సి) షార్ట్ (బి) అర్ష్‌దీప్ సింగ్ 1; గ్రీన్ (సి) స్యామ్ కరన్ (బి) ఎలిస్ 67; సూర్యకుమార్ యాదవ్ (సి) అథర్వ (బి) అర్ష్‌దీప్ 57; టిమ్ డేవిడ్ (నాటౌట్) 25; తిలక్‌వర్మ (బి) అర్ష్‌దీప్ సింగ్ 3; నేహల్ వధేరా (బి) అర్ష్‌దీప్ సింగ్ 0; ఆర్చర్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 3; మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 201. వికెట్ల పతనం: 1-8, 2-84, 3-159, 4-182, 5-200, 6-200. బౌలింగ్: షార్ట్ 1-0-7-0, అర్ష్‌దీప్ 4-0-29-4, హర్‌ప్రీత్ బ్రార్ 2-0-15-0, స్యామ్ కరన్ 3-0-41-0, ఎలిస్ 4-0-44-1, రాహుల్ చహర్ 4-0-42-0, లివింగ్‌స్టోన్ 2-0-23-1.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	6	4	2	8	1.043
లక్నో	7	4	3	8	0.547
చెన్నై	6	4	2	8	0.355
గుజరాత్	6	4	2	8	0.212
పంజాబ్	7	4	3	8	-0.162
బెంగళూరు	6	3	3	6	-0.068
ముంబై	6	3	3	6	-0.254
కోల్‌కతా	6	2	4	4	0.214
హైదరాబాద్	6	2	4	4	-0.794
ఢిల్లీ	6	1	5	2	-1.183

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

బెంగళూరు x రాజస్తాన్ (మ. గం. 3:30 నుంచి)
కోల్‌కతా x చెన్నై (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

'కొటక్-పుల్లెల గోపీచంద్ అకాడమీ' ప్రారంభం



గచ్చిబౌలి: బ్యాడ్మింటన్ క్రీడాకారులకు మరో శిక్షణ కేంద్రం అందుబాటులోకి వచ్చింది. శనివారం గచ్చిబౌలిలో కొటక్ మహీంద్ర బ్యాంక్ లిమిటెడ్ సీఎస్‌ఆర్ అసోసియేట్, పుల్లెల గోపీచంద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'కొటక్-పుల్లెల గోపీచంద్ అకాడమీ'ని ప్రారంభించారు. ఈ అకాడమీని అత్యాధునిక మౌలిక వసతులు, అంతర్జాతీయ కోచ్‌లతో ప్రపంచస్థాయి బ్యాడ్మింటన్ శిక్షణ కేంద్రంగా తీర్చిదిద్దుతామని... ఔత్సాహిక, అత్యంత ప్రతిభావంతులైన క్రీడాకారులకు అత్యుత్తమ శిక్షణ ఇస్తామని జాతీయ చీఫ్ కోచ్ గోపీచంద్ వ్యాఖ్యానించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్‌ఆర్)లో భాగంగా కొటక్ మహీంద్ర బ్యాంక్ భారతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారులకు ప్రపంచస్థాయి శిక్షణ సౌకర్యాన్ని అభివృద్ధి చేసేందుకు సహకారం అందిస్తుందన్నారు. యువత భవిష్యత్ కోసం క్రీడా మౌలిక వసతులు అందించేందుకు గోపీచంద్ అకాడమీతో కలిసి పనిచేస్తామని కొటక్ మహీంద్ర బ్యాంక్ హోల్ టైమ్ డైరెక్టర్ శాంతి ఏకాంబరం పేర్కొన్నారు. కొటక్-పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ శిక్షణ కేంద్రంలో అత్యుత్తమ నాణ్యత గల న్యూట్రీషియనిస్టులు, ఫిజియోథెరపిస్టులు, నిపుణులతో కూడిన స్పోర్ట్స్ సైన్స్ సెంటర్ ఉంటుంది. ఆర్థికంగా వెనుకబడిన కోచ్‌లు, క్రీడాకారుల కోసం ఫెలోషిప్ ప్రోగ్రామ్, బ్యాడ్మింటన్ శిక్షణ పరిధిని విస్తరించేందుకు పూర్వ క్రీడాకారుల కోసం కోచ్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో కొటక్ మహీంద్ర గ్రూప్ ప్రెసిడెంట్, సీఎఫ్ఓ జైమిన్ భట్, ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రమణ్యం, భారత షట్లర్లు సైనా నెహ్వాల్, సిక్కి రెడ్డి, శ్రీకాంత్, సాయిప్రణీత్, పుల్లెల గాయత్రి, ట్రెసా జాలీ, అశ్విని పొన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

చాంపియన్ అర్జున్



అస్తానా (కజకిస్తాన్): సాటీ జుల్డిజ్ ఓపెన్ అంతర్జాతీయ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ చాంపియన్‌గా అవతరించాడు. శనివారం ముగిసిన ఈ టోర్నీలో అర్జున్ నిర్ణీత 11 రౌండ్ల తర్వాత 9.5 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. శనివారం జరిగిన చివరి మూడు రౌండ్ గేముల్లో అర్జున్ రెండింటిలో గెలిచి, మరో గేమ్‌ను 'డ్రా' చేసుకొని ఈ టోర్నీని అజేయంగా ముగించాడు. క్రామ్నిక్ (రష్యా)తో జరిగిన తొమ్మిదో రౌండ్‌లో అర్జున్ 47 ఎత్తుల్లో గెలుపొందగా... అరోనియన్ (అమెరికా)తో జరిగిన పదో రౌండ్‌ను అర్జున్ 24 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. కాటరీనా లాగ్నో (రష్యా)తో జరిగిన చివరిదైన 11వ రౌండ్ గేమ్‌లో అర్జున్ 58 ఎత్తుల్లో గెలిచాడు.

బోపన్న జోడీ ఓటమి

బార్సిలోనా: బార్సిలోనా ఓపెన్ టెన్నిస్ టోర్నీ డబుల్స్ సెమీఫైనల్లో రోహన్ బోపన్న (భారత్)-ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం 4-6, 5-7తో వెస్లీ కూలాఫ్ (నెదర్లాండ్స్)-నీల్ స్కుప్‌స్కీ (బ్రిటన్) జోడీ చేతిలో ఓడింది. బోపన్న జోడీకి 45,120 డాలర్ల (రూ. 37 లక్షలు) ప్రైజ్‌మనీ దక్కింది.

సినిమా

ఆ ఒక్క సెంటిమెంట్ ఫాలో అవుతున్నా! - అఖిల్

"30 ఏళ్లకు పైగా మా నాన్నగారు (నాగార్జున) ఇండస్ట్రీలో ఉన్నారు కాబట్టి ప్రతి డిపార్ట్‌మెంట్‌లో ఆయనకు మంచి గ్రిప్ ఉంది. నాకేమైనా సందేహాలు ఉంటే ఆయన్ని అడిగి తెలుసుకుంటాను. అయితే ఫలానా స్క్రిప్ట్ ఓకే చేయాలా? వద్దా అని అడగను. అలా చేస్తే నా కెరీర్ తాలూకు ఒత్తిడిని నాన్నపై పెట్టినట్లు ఉంటుంది. ఆయన ప్రమేయం ఎక్కువగా ఉంటే ఓ వ్యక్తిగా నేను ఎదగలేక పోవచ్చు. అందుకే సొంత నిర్ణయాలు తీసుకుంటున్నాను. ఈ కారణంగానే 'ఏజెంట్' స్క్రిప్ట్‌ను నాన్నతో షేర్ చేయలేదు" అన్నారు అఖిల్. సురేందర్ రెడ్డి దర్శకత్వంలో అఖిల్ హీరోగా నటించిన చిత్రం 'ఏజెంట్'. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 28న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా అఖిల్ చెప్పిన విశేషాలు.



● నాకు యాక్షన్ సినిమాలంటే చాలా ఇష్టం. నా గత చిత్రం 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్' టైమ్‌లో సూరిగారు (సురేందర్ రెడ్డి) 'ఏజెంట్' కథ చెప్పారు. నాకూ నచ్చింది. దాంతో వెంటనే అనౌన్స్ చేశాం. అయితే స్క్రిప్ట్ పూర్తి కావడానికి, నా లుక్ మార్చుకోవడం, లాక్‌డౌన్ వంటి వాటి వల్ల ఈ సినిమా ఆలస్యమైంది. ● 'ఏజెంట్'లో నేను రామకృష్ణ (రిక్కీ) అనే పాత్ర చేశాను. రిక్కీ పాత్ర చాలా కొత్తగా ఉంటుంది. 'ఏజెంట్' ఒక మంచి స్పై డ్రామా. సురేందర్ రెడ్డిగారు ప్రతిదీ ఫైన్ ట్యూన్ చేస్తారు. నేను ఆయన్ను బ్లైండ్‌గా ఫాలో అయ్యాను. ఇక సెకండాఫ్‌లో వచ్చే టార్చర్ సీన్ కోసం చాలా కష్టపడ్డాను. ● సాధారణంగా నేను సెంటిమెంట్స్‌ను నమ్మను. అయితే ఏప్రిల్ 28న 'అడవి రాముడు', 'పోకిరి', 'బాహుబలి' వంటి ఎన్నో సక్సెస్‌ఫుల్ సినిమాలు విడుదలయ్యాయి. ఇలాంటి హిట్ సినిమాలు విడుదలైన ఏప్రిల్ 28న 'ఏజెంట్' సినిమా విడుదల అవుతోంది. ఈ సెంటిమెంట్‌ను మాత్రం ఫాలో అవుతున్నాను. ● నాన్నగారితో స్క్రీన్ షేర్ చేసుకోవడం అనేది నా కల. అది నాన్నగారి వందో సినిమా అయితే నాకు ఇంకా సంతోషం. ఎప్పటికీ గుర్తుండిపోయే సినిమా అవుతుంది. కానీ నాకు తెలిసి అలాంటి స్క్రిప్ట్ ఏదీ ఫైనలైజ్ కాలేదు. 'ఏజెంట్' సినిమా ట్రైలర్ చూసి, నేను చాలా కష్టపడ్డానని తెలిసి మా అమ్మగారు (అక్కినేని అమల) ఎమోషన్ అయ్యారు.

జై శ్రీరామ్.. జై శ్రీరామ్



● ప్రభాస్

'నీ సాయం సదా మేమున్నాం.. సిద్ధం సర్వ సైన్యం.. సహచరులై పదా వస్తున్నాం. సఫలం స్వామి కార్యం' అంటూ 'జై శ్రీరామ్' నామం ప్రతిధ్వనించేలా 'ఆదిపురుష్' చిత్రం నుంచి ఓ లిరికల్ వీడియోను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ప్రభాస్ టైటిల్ రోల్‌లో ఓం రౌత్ దర్శకత్వం వహించిన చిత్రం 'ఆదిపురుష్'. శనివారం ఈ చిత్రం నుంచి 60 సెకన్ల 'జై శ్రీరామ్' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. అజయ్-అతుల్ స్వరపరిచిన ఈ గీతాన్ని హిందీ, తెలుగు, తమిళ, మలయాళం, కన్నడ భాషల్లో విడుదల చేశారు. తెలుగులో రామజోగయ్య శాస్త్రి రాశారు. భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్, ఓం రౌత్, ప్రసాద్ సుతార్, రాజేష్ నాయర్, వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం జూన్ 16న రిలీజ్ కానుంది.

ఐ హేట్ లవ్



● సుధీర్‌బాబు

''దేవుడడిగాడంట.. నన్ను చేరడానికి ఏడు జన్మలు నాకు భక్తుల్లా బతుకుతారా...లేక మూడు జన్మలు రాక్షసుల్లా బతుకుతారా అని. ఏడు జన్మలు నీకు దూరంగా ఉండే కన్నా... మూడు జన్మల రాక్షస బతుకే మిన్న అని దేవతలే కోరుకున్నారట', 'ఐ హేట్ లవ్' అనే డైలాగ్స్‌తో విడుదలైంది 'మామా మశ్చీంద్ర' టీజర్. సుధీర్ బాబు హీరోగా హర్షవర్ధన్ నటించి, దర్శకత్వం వహించిన చిత్రం ఇది. తెలుగు, హిందీ భాషల్లో రూపొందిన ఈ చిత్రంలో మృణాళినీ రవి, ఈషా రెబ్బా హీరోయిన్లు. సోనాలీ నారంగ్, సృష్టి సమర్పణలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్‌రావు నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. శనివారం ఈ సినిమా టీజర్‌ను హీరో మహేశ్‌బాబు సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ చిత్రంలో దుర్గ, డీజే, పరశురామ్ పాత్రలు చేశారు సుధీర్‌బాబు.

చైత్రతో ప్రేమ



● ఇవానా, ఆశిష్

'రౌడీ బాయ్స్'తో ఆకట్టుకున్న ఆశిష్ రెడ్డి హీరోగా నటిస్తున్న రెండో చిత్రం 'సెల్ఫిష్'. కాశీ విశాల్ దర్శకత్వంలో సుకుమార్ రైటింగ్స్ , 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఇవానా కథానాయిక. ఆమె పాత్ర పేరు చైత్ర. ఆందోళనగా ఉన్న చైత్రను హీరో తదేకంగా చూస్తున్న పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. హైదరాబాద్‌లోని పాతబస్తీలో జరిగే ఈ మాస్ లవ్‌స్టోరీలో ఆశిష్ ఓల్డ్ సిటీ కుర్రాడి పాత్ర చేస్తుండగా, ఇవానా ఫైనాన్షియల్ ఎనలిస్ట్ పాత్ర చేస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జె మేయర్, కెమెరా: ఎస్. మణికందన్, సహనిర్మాతలు: హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి, అశోక్ బండ్రెడ్డి.